
# ఏమిటీ లోకం....?

లక్ష్మీశ్రీనివాసన్




"పిల్లలేరి కమలా?" అన్నాడు ఇంట్లోకి అడుగు పెడుతూనే రమణమూర్తి.

"ఆట నుంచి ఇంకా రాలేదండీ! అదేమిటి మీరు ఉత్త చేతుల్తో వచ్చారు...బట్ట లేవి?" రమణమూర్తి మొహంలోకి చూస్తూ అంది కమల.

"తీసుకురాలేదు...అడ్వాన్సు పది రోజులు పోయాక ఇస్తానన్నా రాయన" నిస్పృహగా అన్నాడు రమణమూర్తి.

"పండుగ కూడా పది రోజులే కదండీ వుంది....-ఆయన అడ్వాన్సు అప్పుడిస్తే బట్ట లెప్పుడు తీస్తారు?....ఎప్పుడు కుట్టిస్తారు?" ఆశ్చర్యంగా అడిగింది కమల.

"నిజమే, ఆ సంగతి నాకు తెలియక కాదు. మొన్న అడిగిన పండుగ అడ్వాన్సు ఈవేళ జీతంతో బాటు ఇచ్చేస్తారన్న వుద్దేశ్యంతో బట్టలు తెస్తానని నమ్మకంగా చెప్పాను. కానీ, ఇలా జరుగుతుందనుకోలేదు...."

"ఎలా జరిగినా పిల్లలకు కావాల్సినవి బట్టలు.... వాళ్ళ కివన్నీ అర్థం కావు!" అతడి మాటలకు అడ్డొస్తూ అంది కమల.

"అయితే నన్నిప్పుడేం చెయ్యమంటావు చెప్పు?"

"ఏమో ఏం చేస్తారో....ఒకసారా రెండు సార్లా - ఇప్పటికెన్నాళ్ళ నుండో వాళ్ళను మభ్యపెట్టుకొస్తున్నాం! ఏమైనా ఈ పండక్కి బట్టలెత్తేకపోతే వాళ్ళూరుకునేలా లేరు" అని టీ తీసుకు రావడానికి వంట గదిలోకి నడిచింది కమల.

కమల మాటలు మననం చేసుకుంటూ పిల్లలకేం సమాధానం చెప్పాలా అన్న ఆలోచనలో పడ్డాడు రమణమూర్తి.

తమ ఇంటి కెదురుగా వున్న ఎర్ర త్రికోణం బోర్డును చూస్తూనే....ఎక్కువ మంది పిల్లలతో ఇరుగు, పొరుగు వాళ్ళు పడుతున్న బాధల్ని చూస్తునే నలుగురు పిల్లలకు తండ్రయ్యాడు రమణమూర్తి. అతడా పట్నంలో ఓ చిన్న కార్ల రిపేర్ షెడ్‌లో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. నెలకో నాలుగు వందల యాభై వరకూ జీతం వస్తుందతనికి. కావాల్సిన వాళ్ళంటూ వున్నా ఆ పట్నంలో ఎవరూ లేరు - ఎక్కడెక్కడో వున్నా, ఎవరూ అతన్ని పట్టించుకునే స్థితిలోనూ లేరు....ఎందుకంటే...-ఇప్పటి పరిస్థితుల్ని బట్టి ఎవరి గొడవలు వాళ్ళవి - ఎవరి సంసారాలు వాళ్ళవి. అమ్మా, నాన్నా, అన్నా, తమ్ముడూ, అక్కా, చెల్లీ - అన్న రక్త సంబంధాలు కూడా పట్టించుకోని స్థితికి మనుష్యులు చేరిపోతున్నారంటే ఎవరూ ఆశ్చర్యపోనవసరం లేదు.

చాలా తక్కువ జీతం వచ్చినప్పుడు ఎంతో చక్కగా జరిగిన తన సంసారం - ఎంతో కొంత జీతం ఎప్పటి కప్పుడు పెరుగుతున్నా ఇప్పుడెందుకు జరగడం లేదో, దీనిక్కారణం తనలో వుందో, రోజు రోజుకూ పెరిగి పోతూన్న ధరల్లో వుందో అర్థం కాక సత మత మవుతూ సంసారం నడుపుకొస్తున్నాడు రమణమూర్తి. అదేమిటో ఎంత పొదుపుగా జరుపుకొస్తున్నా ఎప్పుడూ ఏదొకలోటే!.....

బట్టలన్నీ చిరిగి పోయాయని ఇటీవల పిల్లలొకటే గొడవ....'అదిగో....ఇదిగో....' అంటూ సుమారు సంవత్సరం నుంచి వాయిదా వేసుకొస్తున్నాడు వాళ్ళకు. పోనీ ఈ సంక్రాంతి పండక్కయినా కుట్టించి పడేద్దామంటే అదీ సాధ్యపడేటట్టు లేదు.....

"టీ తీసుకోండి!" అంటూ గ్లాసతడి కందించి - గదిలో లైటు వేసింది కమల.

రమణమూర్తి తన ఆలోచనలు కట్టి పెట్టి టీ గ్లాసలా నోటి ముందుంచుకున్నాడో లేదో-

ఉత్సాహంగా గెంతుతూ ఇంట్లోకి ప్రవేశించారు పిల్లలు. ఎదురుగా వున్న తండ్రిని చూస్తూనే "బట్టలేవి నాన్నా?" అంటూ అతడి దగ్గర చేరారు.

టీ త్రాగకుండానే గ్లాసు ప్రక్కన పెట్టి మౌనంగా వుండిపోయాడు రమణమూర్తి.

తండ్రి మౌనం చూసి తమకు బట్టలు తేలేదన్న విషయం పిల్లల కర్థమైపోయింది. "మీరు మళ్ళీ శివరాత్రికో, సంవత్సరాదికో బట్టలు కుట్టిస్తానని చెప్పాలనుకుంటున్నట్టున్నారు. ఈవేళ బట్టలు తియ్యకపోతే మేం వూరుకునేది లేదు!" అన్నాడు పట్టుదలగా పధ్నాలుగేళ్ళ ప్రసాద్.

"వినాయక చవితన్నారు. విజయదశమన్నారు. దీపావళన్నారు.... అన్ని అబద్ధాలే....మళ్ళీ మాకు అబద్ధాలు ఆడకూడదని చెప్తారు!" కాస్త ఆవేశంగా అన్నాడు పదమూడేళ్ళ ప్రకాశం.

"పండుగ చూస్తే పది రోజులు కూడా లేదు. మీరీ వేళయినా బట్టలు తేకపోతే అప్పటి కప్పుడు ఏ టైలరు కుట్టిస్తాడు నాన్నా?" అసలు సిసలైన సందేహాన్ని బయట పెట్టాడు పన్నెండేళ్ళ చిన్నారావు.

"ఆ ఎదురింటి సరోజకూ, సావిత్రికీ వాళ్ళ నాన్నగారప్పుడే పండగ బట్టలు కుట్టించి తెచ్చేశారు. మీరు మా కింకా బట్టలే తియ్యలేదు!" ఏడుపు స్వరంతో అంది వాళ్ళ ఒక్కగా నొక్క ఆడపిల్ల ఆదిలక్ష్మి.

వాళ్ళ మాటల్లో వ్యక్తమయిన ఆవేశం, నిరాశ, దీనత్వం గ్రహించిన రమణమూర్తికి గుండెల్లో సూదులు గ్రుచ్చినట్టనిపించింది. అతడంతరంగంలో అవ్యక్తమయిన బాధ ననుభవిస్తూ నిస్సహాయంగా భార్య వైపు చూశాడు.

తన అంచనాకు మించి పిల్లలు మాట్లాడిన మాటలూ, భర్త నిస్సహాయ స్థితీ చూస్తుంటే కమలకేం పాలుపోలేదు. వాళ్ళ నెలా సముదాయించాలో అర్థం కాలేదామెకు

"నాన్నకు డబ్బు అమర్లేదర్రా....సంవత్సరాదికి తప్పనిసరిగా కుట్టిస్తార్లెండి...." అంది కొన్ని క్షణాల తర్వాత.

ఆ పాత పాట వినగానే పిల్లల్లో ఆవేశం ముంచుకొచ్చింది. అది వ్యక్తపర్చే ధైర్యం లేక ఏడుపు రూపం ధరించింది.

వాళ్ళనిక ఓదార్చడం కష్టమనిపించింది కమలకు. రమణమూర్తి ఉలుకూ-పలుకూ లేకుండా అలాగే కూర్చొని వున్నాడు. "నాన్నచేత నేను బట్టలు తెప్పిస్తాను గాని ముందు మీరు ఏడుపు కట్టి పెట్టి వెళ్ళి స్నానాలు చెయ్యండి!" అంది కాస్సేపటి తర్వాత ఒక నిశ్చయాని కొచ్చిన కమల.

సందేహాస్పదంగా తల్లిని చూస్తూ నిమిషం తర్వాత పిల్ల లక్కడ్నుంచి కదిలారు. ఆశ్చర్యంగా కమల మొహంలోకి చూశాడు రమణమూర్తి.

"ఏదీ మీ జీతం ఎంతొచ్చిందో ఇటివ్వండి!" అంది పిల్లలటు వెళ్ళగానే కమల.

తన దగ్గరున్న నాలుగు వందల పాతికా తీసి కమల కిచ్చాడు రమణమూర్తి.

"ఈ నూట యాభై తీసుకెళ్ళి ఏవో చౌక రకం గుడ్డలు నలుగురికీ తీసుకురండి. మనం ఇచ్చిన



అడ్వాన్సు ఈ నెల అద్దె క్రింద చూసుకోమని ఇంటి యజమానికి చెబుతాను. చేబదు లిచ్చిన సుబ్బ లక్ష్మిని వడ్డీ కట్టి వూరుకోబెడతాను...మనం చచ్చే వరకూ ఈ సమస్య లుండేవే....మాటల మత్తు మందు జల్లి మభ్యపెడుతున్నామని పిల్లల కర్థమైపోయింది. వాళ్ళిక వూరుకోరు. మీరు తొందరగా వెళ్ళొచ్చేయండి....." అంటూ ఆ డబ్బులో నూట యాభై తీసి అతడి కిచ్చింది కమల.

వింతగా భార్య వైపో మారు చూసి, మారు మాట్లాడకుండా లేచి బయటి కొచ్చాడు రమణమూర్తి. శీతాకాలపు చలి గాలి ఆవేళప్పుడే ప్రారంభమైంది. అతడు చేతులు గుండెల మీదకు చేర్చుకుని నెమ్మదిగా నడుస్తూ – అర గంట తర్వాత మెయిన్ బజార్లో ప్రవేశించాడు. అనేక రకాల షాపులతో...వాటి నలంకరించిన విద్యుద్దీప కాంతులతో బజారు వింత అందాల్ని సంతరించుకొంది. రానున్న సంక్రాంతి సంరంభంతో; క్రిక్కిరిసిన జన సందోహంతో హడావుడిగా వుంది....

పాతిక రూపాయలకే చీరని మైక్‌లో చెబుతున్నారో షాపులోంచి; తమ మిల్లు బట్టలు కొంటే ట్వంటీ ఫైవ్ పర్సంట్ తగ్గింపని పదే పదే చెబుతున్నారు మరో షాపులోంచి; నకిలీ వస్త్రాలు చూసి మోసపోవద్దు ...మిసేవలో మా కరవై ఏళ్ళని అదే పనిగా పాట పాడుతున్నారింకో షాపులోంచి. అవన్నీ వింటూ - షాపుల అందాల్ని కన్నులారా కంటూ – బజారు చివరినున్న చిదంబరంగారి బట్టల కొట్లో కడుగు పెట్టాడు రమణమూర్తి. అక్కడన్ని రకాల బట్టలూ వుంటాయి. కానీ, అవి ఎన్నాళ్ళు మన్నుతాయో చెప్పలేం!...

రమణమూర్తిని చూడగానే అతడికేం కావాలో గ్రహించినట్టు రక రకాల డిజైన్స్ గల కాటన్ రోల్స్ తీసి పడేసి వాటి రేట్లు వివరించాడు చిదంబరం....- అంతటితో ఆగకుండా తన మాటల చాతుర్యంతో రమణమూర్తిని సమ్మోహితుణ్ని చేసి–మొత్తానికతడిచేత బట్టలు కొనిపించాడు.

తను పట్టుకొచ్చిన డబ్బులో మిగిలిన అయిదు రూపాయల చిల్లరా జేబులో వేసుకొని; చిరునవ్వుతో చిదంబరం అందించిన బట్టల ప్యాకెట్ చేత్తో పట్టుకొని ఆ కొట్లోంచి బయట పడ్డాడు రమణమూర్తి

ఇంటికి రాగానే అతడి చేతిలో వున్న ప్యాకెట్టు కలబడి లాకున్నంత పని చేశారు పిల్లలు. కొత్త బట్టలమీద వాళ్ళ కున్న సరదా చూసి రమణమూర్తికి తన చిన్నతనం గుర్తు కొచ్చింది – సంక్రాంతికో జత, దీపావళికో జత కుట్టించి తను తొడుక్కు తిరుగుతుంటే ఆనందంతో పొంగిపోయే తల్లీ, తండ్రీ గుర్తొచ్చారు....'అదంతా కల. . ఓ అందమైన కల ..' అతడలా అనుకుంటూండగానే – ప్యాకెట్ విప్పి బట్టలు తీసి చూచిన పిల్లల మొహాలు మాడిపోయాయి...

"రిక్షావాడు కూడా పాలిష్టర్ షర్టు తొడుక్కుంటున్నాడు నాన్నా!" అనేశాడు పెద్దాడు

"ఎప్పుడూ ఈ చౌక రకం గుడ్డలేనా?" అంటూ చేతిలో వున్న ఫ్యాంటు ముక్క విసిరేశాడు రెండోవాడు. మిగిలిన యిద్దరూ ఏమీ అనకపోయినా తమ హావ భావాలతో బట్టలు నచ్చలేదన్న ధోరణి వ్యక్తం చేశారు.

వాళ్ళ ప్రవర్తనకు రమణమూర్తి మనస్సు చివుక్కుమంది. అయినా అతడు కోపం తెచ్చుకోలేదు. నిజాని కతడు కోపాన్ని జయించి సహనాన్ని వరించి చానాళ్ళయింది. కమల మాత్రం వూరుకోలేదు – "ఏమిటి...ఏమిటి మీ వుద్దేశ్యం? ఇందాకట్నుంచి చూస్తున్నాను మీ వరస.... ఇంతెంత లేరు గాని ఇష్టం వచ్చినట్టూ వాగుతున్నారు! చిన్న నోటికి పెద్ద మాటలు....మరొక్కసారి నోరు విప్పితే మీ వీపులు చిట్లుతాయి! ఇవి కూడా లేక ఎంతమం దేడుస్తున్నారో మీకేమైనా తెలుసా?" అంది తీవ్రంగా.

అలతనలా హెచ్చరించినా అయిదారు క్షణాలపాటు పిల్లల మూలుగులు వినిపించాయి – 'వున్న దానితో సంతృప్తి పడవలెను' – అన్న సూక్తి జ్ఞప్తికి తెచ్చుకున్నారోఏమో, "నాన్నా బట్టలు తీసుకెళ్ళి టైలరు కిచ్చేద్దాం!" అన్నారు కాస్సేపాగి.

చిరు నవ్వుతో పిల్లల వైపు చూశాడు రమణమూర్తి.

"ఇంత పొద్దు పోయాక ఎందుకు – ప్రొద్దున్నే వెళుదురు లెండి!" అంది కమల.

* * *

ఏమైనాపనుండీ; చదువుకోమనీ ఎంత సేపు లేపినా నిద్ర నుంచి లేవని పిల్లలు ఆ రోజు సూర్యుడుదయించక ముందే మేల్కొని తమ అల్లరి చిల్లర పనులతో రమణమూర్తికి సుప్రభాతం పాడారు. ఏవేవో ఆలోచనలతో రాత్రి ఆలశ్యంగా పడుకున్న రమణమూర్తి నిద్ర మత్తు వదలకపోయినా లేవడం తప్పని సరైంది.

కాల కృత్యాలు తీర్చుకొని కాస్త కాఫీ కషాయం గొంతులో పోసుకొని పిల్లల్ని వెంట బెట్టుకొని నాలుగో వీధిలో వున్న మూలయ్య టైలరింగ్ షాపు దగ్గర కెళ్ళాడు రమణమూర్తి. అప్పటికే పండుగ పని తొందర్లో వున్న మూలయ్య అతడ్ని చూసీ మాట్లాడలేదు. రమణమూర్తి అదేం పట్టించుకోకుండా, "మూలయ్యా! పిల్లలకీ బట్టలు సంక్రాంతి నాటికి కుట్టివ్వాలి!" అని తన చేతిలో వున్న పేకెట్ అతని ముందు పడేశాడు.

మూలయ్య మొహం చిట్లించుకొని. – పేకెట్‌లో వున్న బట్టలు తీసి చూసి, "ఖాళీ లేదండీ!" అన్నాడు.

అదేమిటి మూలయ్యా! నే నెప్పుడు బట్టలు కుట్టించినా నీ దగ్గరే కదా నువ్వే అలా అంటే ఎలా చెప్పు? ఏదో విధంగా వీలు చేసుకొని కుట్టి పెడుదూ!" అన్నాడు బ్రతిమాలుతున్న ధోరణిలో రమణమూర్తి

అంత పని తొందర్లోనూ రమణమూర్తి మాటలకు మూలయ్య విస్తుపోయాడు అతడు తన దగ్గర బట్టలు కుట్టించి 'ఎన్నాళ్ళయిందా – ఎన్నేళ్ళయిందా?' అని అర నిమిషంపాటు ఆలోచించాడు ఆ తర్వాత ఏమనుకున్నాడో; "ఏం

చెయ్యమంటారు చెప్పండి? ఇప్పటికే నన్ను కొప్పెట్టే-టన్ని బట్టలున్నాయి....ఇస్తానని తీసుకొని ఇవ్వక-పోతే మీరు బాధ పడతారు. మీరేమనుకోక ఈ దఫా ఎవరికైనా ఇవ్వండి!" అన్నాడు నిర్మోహమాటంగా.

అంత నిర్మోహమాటంగా చెబుతున్న మనిషి నింకెలా ఒప్పించాలో తెలియక అయిదు నిమిషాలపాటు అలాగే నిలబడి పోయాడు రమణమూర్తి. అతడి ఉనికినే పట్టించుకోకుండా తన పనిలో మునిగిపోయాడు మూలయ్య.

రమణమూర్తి బరువుగా నిట్టూర్చి అక్కడ్నుంచి కదిలి వెంకటాపురంలో వున్న మరో టైలరు దగ్గరకు వెళ్ళాడు. అతడూ అదే మాట – అతడూ కాదు ఆ తర్వాత రమణమూర్తి ఎక్కడెక్కడో వున్న ఎన్నో టైలరింగ్ షాపులచుట్టూ తిరిగాడు. అదేం చిత్రమో ఏ ఒక్కరూ ఆ బట్టలు కుడతామన్న పాపాన పోలేదు. ఏ టైలరింగ్ షాపులో చూసినా కుప్ప తిప్పలుగా బట్టలు.....కళ్ళు చెదిరిపోయే ఖరీదైన బట్టలు....

ఓ టైలరు అసలు బట్టలు ముట్టుకోకుండానే, "కాటనా? టెరీకాటన్ – పాలిస్టర్ లాంటి వేవైనానా?" అని అడిగేశాడు. దానికి రమణమూర్తి చెప్పిన సమాధానం విని "ఇప్పుడు తీస్తే తీశారు గాని కాటన్ బట్ట లింకెప్పుడూ తీయకండి!....అసలు కాట నిప్పు డెవడు తొడుగుతున్నాడు??.....నా మటుకు నేను కాటన్ బట్టలు కుట్టడం మాని చాలా కాలమైం!" అన్నాడు అతి మామూలుగా.

ఆ మాటలతో మతి పోయిన రమణమూర్తి పొంగు కొస్తున్న ఆవేశాన్ని అణుచుకొని వెను దిరిగాడు – 'ఏమిటీ లోకం? ఈ లోకంలో ఇక ముందు తనలాంటి సామాన్యులకు చోటుండదా?...-.ఏదో విధాన బట్టలు తీసి పిల్లల కళ్ళ నీళ్ళు తుడవాలనుకుంటే చివరి కవి కుట్టేవాడే లేకపోయాడు.... ఆపొగరుబోతు ఏం కూశాడూ? .-చివరకు వాడిచేత మాటనిపించుకోవాల్సి వచ్చిందే!.... ఆకలి బాధ చల్లార్చుకోవడమే క్లిష్టమవుతూన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఒంటి ఒంపులు కనిపించే అపురూప వస్త్రాలు కొనుక్కోగల అవకాశం అందరికీ ఎలా వస్తుంది?. ..' ఇలా తలపోస్తూ రమణమూర్తి నడుస్తున్నాడు. అతని వెనుకే పిల్లలు నడుస్తున్నారు తిరిగి, తిరిగి వున్నారేమో వాళ్ళ కాళ్ళు పీక్కుపోతున్నాయి, అలసట వాళ్ళ మొహాల్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. నిరాశ వాళ్ళ మనస్సుల్లో 'చోటు చేసుకుంది. కాటన్ బట్టలు తీసిన తండ్రి మీద పట్టలేని కోపం పుట్టుకొచ్చింది – అప్పుడేమైనా అంటే తండ్రి తంతాడేమోనని ఎవరూ మాట్లాడ్డంలేదు.: .

"చూశారుగదా మన పాట్లు. పండ గెళ్ళాక స్థిమితంగా కుట్టించుకోవచ్చు ...పదండి ఈ దగ్గర త్రోవన ఇంటికి పోదాం!" అంటూ పిల్లలతో సౌమ్యంగా చెప్పి – ఓ ఇరుకు సందులోకి తిరిగాడు రమణమూర్తి. పైకలా అన్నాడే కాని అతడి హృదయాన్ని ·చెప్పలేని బాధ కుమ్మరి పురుగులా దొలుస్తోంది. కమలకీ ఆలోచన ముందే వచ్చి వుంటే తనకీ పాట్లు లేకపోయేవికదా అనిపించిందా క్షణాన అతడికి.

ఆ సందులో అయిదారు గజాలు ముందుకు నడిచి అకస్మాత్తుగా దేవుడు కనిపించినట్టు ఆగిపోయాడు రమణమూర్తి. అక్కడో టైలరు ఓ పెంకుటిల్లు ముందు గదిలో మిషను పెట్టుకొని జాకెట్టేదో కుడుతున్నాడు. అతడికి మరీ అంతెక్కువ పని లేనట్టు చూడగానే తెలిసి పోయింది చివరి ప్రయత్నంగా అతడి దగ్గర కెళ్ళాడు రమణమూర్తి

"రండి! రండి! బట్టలు తీసుకొచ్చారా. ..ఎప్పటి క్కావాలి?,..." అంటూ చేస్తున్న పని ఆపి తన ప్రక్క నున్న స్టూలు రమణమూర్తి కందించాడతను.

రమణమూర్తికి ప్రాణం లేచొచ్చింది. అంతవరకూ పడ్డ శ్రమను మర్చిపోయి ఆ స్టూలు మీద కూర్చొని బట్టల పేకెట్ అతడి కందించాడు

అతడు బట్టలు తీసి చూసి "పిల్లలకే గాని మీరు తీసుకోలేదా?" అన్నాడాప్యాయంగా.

అతడి ఆప్యాయతకు రమణమూర్తి ముగ్ధుడయ్యాడు. ఒక మనిషి నుంచి మరో మనిషి ముందుగా ఆపాయతా, అభిమానాలనే కోరు-కుంటాడేమో –"నాదేముంది లెండి ముందు పిల్లల సంగతి చూడాలికదా!" అన్నాడొక్క క్షణం తర్వాత రమణమూర్తి.

"మీ రెంతో అమూల్యమైన మాట సెలవిచ్చారు. మీ రన్నట్టు పిల్లల ఆనందమే మన ఆనందం! వాళ్ళ చిరునవ్వులే మన జీవితాలకు వెలుగు రవ్వలు!!" అన్నాడతను.

"నీ కెంతమంది పిల్లలు బాబూ?" అన్నాడు, అతడి మొహంలోకి చూస్తూ రమణమూర్తి.

"నా కింకాపెళ్ళే కాలేదండి. కానీ, పిల్లలంటే చాలా ప్రేమ!" అన్నాడతను కాస్త సిగ్గు పడుతూ.

"అలాగా బాబూ!... చాలా సంతోషం అయితే నాలాగ మాత్రం నలుగురి పిల్లలకు తండ్రివి కావద్దు" అని ఒక్క క్షణమాగి "ఔనూ, షాపు ఇంత మారుమూల పెట్టావేమిటి బాబూ?" అన్నాడు రమణమూర్తి.

"ఏం చెయ్యమంటారు చెప్పండి! బజార్లో ఎంత ప్రయత్నించినా గది దొరకలేదు – వ్రేలెడు వెడల్పు – పొడవూ వున్న గదైనా వేల కొద్దీ అడ్వాన్సు...తిరగ్గా తిరగ్గా ఈ ఇల్లుగలాయన వంద రూపాయలకీ గది అద్దె కివ్వటమే కాకుండా వచ్చిన వెంటనే చాలా బట్టలు కూడా ఇచ్చాడు. పండ గెళ్ళాక వాళ్ళమ్మాయి పెళ్ళట! ఇవి గాక ఇంకో అర డజను జాకెట్లు కుట్టేస్తే వాళ్ళ పనైపోతుంది. అన్నట్టు మీ కెప్పటి క్కావాలి బట్టలు?" అన్నాడతను.

"పండుగ రేపనగాఇస్తే చాలు బాబూ!" అన్నాడు రమణమూర్తి.

అతడు పైకి లేచి వరసాగ్గా పిల్లల కొలతలు తీసుకొని, "భోగి రోజు సాయంత్రానికి బట్టలు సిద్ధం చేసి వుంచుతాను. నలభై రెండు రూపాయలు తీసుక రండి" అన్నాడు.

అతని వైపు కృతజ్ఞతా పూర్వకంగా చూసి "వెళ్ళొస్తాన"ని చెప్పి అక్కడ్నుంచి కదిలాడు రమణమూర్తి. అతడికి నెత్తిమీదున్న పెద్ద బరువు దిగిపోయినట్టనిపించింది. కొత్త శక్తేదో వచ్చినట్టు హుషారుగా పిల్లలతడ్ని అనుసరించారు.


* * *

అడ్డున్న పది రోజుల్నీ అవలీలగా అధిగమించి భోగి పండుగ వచ్చేసింది. సంక్రాంతి, కనుమ తప్ప భోగి రోజు సెలవు లేదు రమణమూర్తికి. ఆ రోజతను డ్యూటీకి వెళ్ళిపోతుంటే బట్టల విషయం హెచ్చరించారు పిల్లలు. వాళ్ళ ఆరాటానికి నవ్వుకొని, "సాయంత్రం వచ్చేటప్పుడు తెస్తానని" చెప్పి బయల్దేరాడతను.

అలా డ్యూటీ కెళ్ళిన రమణమూర్తి చిన్న కారేసు-కొని పదకొండు గంటలకు ఇంటి కొచ్చాడు.

"ఏమిటీ భోగిరోజు భోగం! మన యోగం ఏమైనా మారిందా?" అంది నవ్వుతూ కమల. అర్థంటుగా బయటాగిన కారు దగ్గరకు పరుగెత్తారు పిల్లలు.

"నీ మొహం...మన యోగం ఈ జన్మ కిక



మారదు!.... యెండమూరు దగ్గర మన ఎం. ఎల్. ఏ. గారి కారు ఆగిపోయిందట. నన్నూ, మరొకతన్నీ వెళ్ళి దాని ట్రబులేమిటో చూసి తీసుకు రమ్మన్నారు మా ఓనరుగారు. ఇదిగో పండుగ అడ్వాన్సు కూడా నూట యాభై ఇచ్చారు. మేము తిరిగొచ్చేసరికి ఎంత టైమవుతుందో తెలీదు. సాయంత్రానికి నేను రాకపోతే పెద్దోడ్ని వెళ్ళి బట్టలు తెచ్చుకోమని చెప్పు!" అన్నాడు రమణమూర్తి.

"పండగ పూట వూళ్ళో లేకుండా ఏమిటండీ ఇది?....కాస్త భోజనమ్మైనా చేసి వెళ్ళకూడదూ?" అంది కమల.

"దార్లో ఎక్కడో తింటాంలే; ఇప్పటికే ఆలశ్యమ్మైంది!..." అంటూ బయటి కొచ్చేశాడు రమణమూర్తి – పిల్లలు నలుగురూ కారులో కూర్చొని తెగ సంతోషపడి పోతున్నారు.

"ఈ కారెవరిది నాన్నా? మనకీ ఇలాంటి కారుంటే!" అన్నాడు తండ్రి కారు దగ్గరకు రాగానే ప్రసాద్.

"విమానం వద్దూ.....వెధవల్లారా....వెధవ గొంతెమ్మ కోరికలూ మీరూను. దిగండి ముందు!" అన్నాడు వస్తున్న నవ్వాపుకుంటూ రమణమూర్తి.

బిక్క మొహా లేసుకుని పిల్లలు దిగిపోయారు. గుమ్మంలో నిలబడ్డ కమలవైపు చూసి, చిన్నగా నవ్వి కారు స్టార్టు చేశాడు రమణమూర్తి.

* * *

ఓనరప్పగించిన పని పూర్తి చేసుకొని రమణమూర్తి తిరిగి ఇంటి కొచ్చేసరికి రాత్రి ఏడు గంట లైంది. ప్రసాద్ తరువాతి వాళ్ళు మొహాలు

## ఏమిటీ లోకం

ముడుచుకొని మౌనంగా ఒకచోట కూర్చొనున్నారు. కమల వంటింట్లో ఏదో పని చక్కబెట్టుకుంటోంది.

"ఏమ్మైంది కమలా! వాళ్ళలా వున్నారేం?" అన్నాడు కమల దగ్గర కెళ్ళి రమణమూర్తి.

"బట్టలు తీసుక రమ్మని ప్రసాద్‌ను పంపుతూంటే వాళ్ళు వెళ్తా నన్నారు. అందరూ ఎందుకంటే విన్లేదు.....అందుకని..."

"అంధుకని పండుగ పూట కొట్టావన్నమాట ... బాగానే వుంది ...ఇంతకీ వాడెళ్ళి ఎంత సేపయింది?"

"ఆరు గంటల వరకూ మీ కోసం చూసి వాడ్ని పంపాను. ఎంచేతో ఇంకా రాలేదు" అంది కమల

రమణమూర్తి తల పంకించి, పిల్లల దగ్గర కొచ్చి కూర్చొని ఆ మాటా, ఈమాటా చెబుతూ అయిద నిమిషాల తర్వాత వాళ్ళని నవ్వించ గలిగాడు ఇంతలో కమల కూడా పని చక్కబెట్టుకొని వచ్చి వాళ్ళ దగ్గర కూర్చొంది.

మరో అరగంట గడిచి పోయింది. గాని ప్రసాద్ రాలేదు. వెళ్ళి రెండు గంట లవుతున్నా వాడెందుకు రాలేదో రమణమూర్తి కర్థం కాలేదు – 'అన్నమాట ప్రకారం టైలరు బట్టలు కుట్ట లేదా? కుట్టిచ్చేస్తాను కూర్చోవయ్యా . అన్నాడా?. .అసలా టైలరింగ్ షా పెక్కడో వాడికి తెలియనే లేదా?....కొంపదీసి డబ్బుగాని పారేశాడా??' ఆలశ్యం అయే కొలదీ ఇలాంటి అనుమానా లెన్నో రమణమూర్తి మనసులో చోటు చేసుకో నారంభించాయి.

మనిషక్కడే వున్నా మనసంతా ఇంకా రాని ప్రసాద్ మీదే వుంది కమలకు; – "నా కేదో భయంగా వుంది.....మీరు వెళ్ళి చూడండీ!" అంది మరి కొన్నేపటి తర్వాత కమల.

మరో అయిదు నిమిషాలు చూసి – ఇంటి గుమ్మం దాటాడు రమణమూర్తి సరిగ్గా అప్పుడే నీరసంగా నడిచి వస్తూ కనిపించాడు ప్రసాద్ "బట్ట లేవిరా?" అన్నాడు వుత్త చేతుల్తో వచ్చిన ప్రసాద్‌ను చూసి రమణమూర్తి.

ప్రసాద్ మాట్లాడలేదు "ఏమ్మైంది డబ్బు గాని పారేశావా?" అడిగింది కమల.

వాడు జేబులోంచి డబ్బు తీసి విసురుగా క్రింద పడేసి, ఒక్క సారిగా ఘొల్లు మన్నాడు. కంగారు పడింది కమల ..."ఏమిట్రా? ఏమ్మైందో చెప్పకుండా ఏమిటా వెధవ్వేడుపు?" విసుగ్గా అన్నాడు రమణమూర్తి.

"ఆ టైలరు నిన్న రాత్రి ఎవ్వరికీ తెలీకుండా పరారయ్యాడట. అక్కడ మిషనూ లేదు.....బట్టలూ లేవు....." అంటూ మరోసారి బావురు మన్నాడు ప్రసాద్. అంతే; పిల్లలంతా ఆరునొక్క రాగం మొదలు పెట్టారు. నిశ్చేష్టురాలైంది కమల.

"ఏమిటీ లోకం?.....ఈ లోకంలో అంతటి దగాకోర్లూ... ఇంతటి నయవంచకులూ వున్నారా? ఎందుకీ లోకంలో ఇంతిలా మాయా, మోహాలు ప్రబలి పోతున్నాయి??" ఆవేదన, ఆవేశం సమపాళ్ళలో పొంగు కొచ్చి కళ్ళు ఎర్రబడగా చాలాసేపు అలాగే వుండిపోయాడు రమణమూర్తి. □


రు. 40,000 విలువచేసే బహుమతులు గెలవండి

1వ బహుమతి : ఎజ్డీ మోటార్ సైకిల్ లేదా రు. 13,000 నగదు.
రెండవ బహుమతులు : కలర్ టీవీ లేదా రు 9,000 నగదు
మూడవ బహుమతులు : ● మూడు స్పీడ్‌ల మిక్సర్-కమ్-గ్రైండర్‌లు తగ్గింపు ధర రు 500/- OR TAPE RECORDER
● రెండు స్పీడ్‌ల మిక్సర్-కమ్-గ్రైండర్‌లు తగ్గింపు ధర రు 325./-s.
● రెండు బ్యాండ్‌ల ట్రాన్సిస్టర్‌లు తగ్గింపు ధర రు 225/-s



ఇది చెయిన్ లింక్ పధకం క్రింద అమ్మకాలను పెంచేందుకు ఉద్దేశించిన పధకం.
ఈ క్రింద మూడు వరుసల్లో, ఏ పక్కనుంచి కూడినా 57 వచ్చే విధంగా 15 నుంచి 23 వరకే అంకెలను వాడేం.
18 + 23 + 16 = 57 ఉదాహరణకి
17 19 21
22 15 20
మీరు చేయవలసిందల్లా : ఇదే విధంగా ఎటు చూసినా 60 వచ్చే విధంగా మూడు వరుసల్లో 16 నుంచి 24 వరకూ అంకెలను వాడాలి.
మీ ఎంట్రీలను, తెల్లకాగితం పైన, లేదా పోస్ట్ కార్డు పైన ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రం వ్రాసి 15 రోజులలోగా పంపండి ఎక్కువ మంది ఎవరిని ఎంపిక చేసుకుంటారో దానిని బట్టి కరెక్టు పరిష్కారాన్ని నిర్ధారిస్తాము ఆ వారంలో అందిన కరెక్టు ఎంట్రీలు ఆధారంగా ప్రతీ వారం తగ్గింపు ధరలకు బహుమతులను యిస్తారు. విజేతలకు పోస్ట్ ద్వారా తెలియబరుస్తారు జడ్జిల నిర్ణయం తుది నిర్ణయం అన్ని వివాదాలు ఢిల్లీ న్యాయస్థానాల పరిధిక లోబడి ఉంటాయి

**PRIMIER ELECTRONICS** (TEL)
**POST BOX NO. 2715, KAROL BAGH; NEW DELHI-5**



**60 రోజుల ఉచిత ట్రయల్**
ప్రత్యేక గొప్ప కానుక టేప్ రికార్డు
**ఉచితము**



ఆల్ వరల్డ్ ట్రాన్సిస్టర్ సెట్టు, పోస్టేజి, ప్యాకింగు మరియు సేల్సుటాక్సుతో అన్ని చేరి రు. 170/– లకే లభించును. ప్రతి ట్రాన్సిస్టర్ సెట్టుతో ఒక క్యాసెట్ టేప్ రికార్డు ఉచిత కానుకగా పొందవచ్చును. సంతృప్తి చెందని పిదపనే డబ్బు వాపసు చేయుట లేదా వేరే సెట్టు ఇవ్వటం జరుగుతుంది.



నేడే మీ ఆర్డరు ఇంగ్లీషు లేదా హిందీలో వ్రాయండి :

M/s **Geneva Electronic** (W.A.P.)
**Post Box No. 9432, DELHI-110051.**